





వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, డేవిడ్

# సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

### రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 30 : అర్హులైన నిరుపేదలకు నీడ కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ఎండీ గౌతమ్ పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియలో సేకరించిన వివరాలను యాప్‌లో నమోదు చేయడం, ప్రక్రియ పూర్తి అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్లు కేటాయించి, అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి, అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం డేవిడ్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య, హౌసింగ్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు, ఈడీఎం గౌతమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సర్వే పకడ్బందీగా కొనసాగుతున్నదని తెలిపారు. ప్రక్రియ నిర్వహణ కోసం నియమించిన సర్వే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇండ్ల ఫొటోలు, ఇంటి యజమానుల వివరాలు సేకరించి, ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు.

# ప్రమాదకరంగా పార్కింగ్

● జాతీయ రహదారిపై భారీ వాహనాలు ● ఇబ్బందులుపడుతున్న వాహనదారులు ● అధికారులు స్పందించాలని కోరుతున్న చోదకులు



జాతీయ రహదారిపై పార్కింగ్ చేసి ఉన్న భారీ వాహనాలు

బెల్లంపల్లి, డిసెంబర్ 29 : పట్టణంలోని జాతీయ రహదారిపై భారీ వాహనాలు యథేచ్ఛగా పార్కింగ్ చేస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారిపై అడ్డంగా వాహనాలు నిలిపి ఉంచడంతో వాహనచోదకులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వంద పడకల దవాఖాన నుంచి గాంధీనగర్, కన్నాల, డబుల్ బెడ్ రూం ఇళ్లు తదితర జాతీయ రహదారి పొడవునా పగలూరాత్రి తేడా లేకుండా పార్కింగ్ చేస్తున్నారు. తాండూర్, బెల్లంపల్లి నుంచి వంద పడకల దవాఖాన, గాంధీనగర్‌కు వెల్లేందుకు బైకులు, ఆటోలు రెండు కిలో మీటర్ల నుంచి యూ టర్న్ తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో రాంగ్ రూట్‌లో రాకపోకలు సాగిస్తుంటారు. ఇదే దారిపై భారీ వాహనాలు పార్కింగ్ చేసి ఉంచడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరిగిన సందర్భాలూ ఉన్నాయి. పెద్ద ప్రమాదాలు జరుగకముందే సంబంధిత శాఖ అధికారులు స్పందించి జాతీయ రహదారిపై అనవసరంగా భారీ వాహనాలను పార్కింగ్ చేయకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.



### దుకాణాదారులకు నోటీసులిస్తాం..

కన్నాల నుంచి కాల్‌టెక్స్ జాతీయ రహదారిపై భారీ వాహనాలు ఎక్కడికక్కడ పార్కింగ్ చేయకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. సంబంధిత దుకాణాదారులకు నోటీసులు ఇచ్చి, అక్రమ పార్కింగ్‌ను అరికడుతాం. ఆయా దుకాణాల ముందు, సమీపంలో లారీలు, ఇతర వాహనాలు నిలిపితే దుకాణాదారులను బాధ్యులను చేసి, చర్యలు తీసుకుంటాం. అలాగే భారీ వాహనదారులకు అవగాహన కల్పిస్తాం.

*- అఫ్జలుద్దీన్, సీఐ, బెల్లంపల్లి రూరల్*

# అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

### మంచిర్యాల మున్సిపల్ సమావేశం

మంచిర్యాల టౌన్, డిసెంబర్ 30 : మంచిర్యాల మున్సిపాలిటీలో సాధారణ నిధులు రూ.71.28 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం పలికింది. మంచిర్యాల మున్సిపల్ సాధారణ సమావేశం సోమవారం వైస్‌చైర్మన్ సల్ల మహేశ్ అధ్యక్షతన నిర్వహించారు. గడిచిన మూడు నెలల కాలంలో అత్యవసరంగా చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను జనరల్ ఫండ్ నుంచి చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం పలికింది. ముఖ్యంగా విద్యుత్ మోటార్ల మరమ్మతులు, వార్డుల్లో సబ్‌మెర్సిబుల్ మోటార్ల మరమ్మతులు, పలు పండుగల సందర్భంగా చేపట్టిన అత్యవసర పనులు, ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా చేపట్టిన మొత్తం 59 పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించేందుకు కౌన్సిల్ అంగీకరించింది. పలు వార్డుల్లో రూ.66.68 లక్షలతో చేట్టాల్సిన పైపులైన్ల విస్తరణ పనులు, మరమ్మతులకు సంబంధించిన అంచనా మొత్తానికి కౌన్సిల్ ఆమోదం పలికింది. మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, మున్సిపల్ ఇంజినీర్ మసూద్ అలీ, టీపీవో సంపత్, ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉదయ్‌కిరణ్, వైకుంఠం, మేనేజర్ విజయ్‌కుమార్, సిబ్బంది, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ సల్ల మహేశ్, సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, అధికారులు



క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్న అసోసియేషన్ సభ్యులు

# జిల్లా జట్టుకు స్వాగతం

నస్పూర్, డిసెంబర్ 30 : హనుమకొండలో జరిగిన సీఎం కప్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టుకు సోమవారం మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఘనంగా స్వాగతం పలికారు. కోచ్ అరవింద్, క్రీడాకారులను డీవైఎస్‌వో కీర్తి రాజ్‌వీర్, అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్ రావు, ట్రెజరర్ రమేశ్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి పూలమాలలు వేసి, అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఫణిరాజా, రామయ్య, రమేశ్, రాజయ్య, సీనియర్ క్రీడాకారులు సాయి, కళ్యాణ్, విశాల, శృతి, వర్ష తదితరులు పాల్గొన్నారు.

# పేదలు, యాచకులకు సాయం

కాసిపేట, డిసెంబర్ 30 : మందమర్రి ఏరియాలోని కాసిపేట వన్ ఇంక్లైన్ గని సర్వే డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేయూత స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాయిబాబా దేవాలయం, రైల్వే స్టేషన్, ప్రభుత్వ దవాఖాన సమీపంలోని నిరుపేదలు, యాచకులకు బిర్యానీ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. సర్వే ఆఫీసర్ మహబూబ్ ఖాన్, సేవా సమితి అధ్యక్షుడు రవీందర్, సెక్రటరీ రాజమల్లు, సభ్యులు అసిస్టెంట్ చైన్‌మెన్లు విజయ్, సర్వే స్టాఫ్ గణేశ్, ప్రవీణ్, షకీల్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

# కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చెన్నూర్, డిసెంబర్ 30 : బెల్లంపల్లిలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో చెన్నూర్ పట్టణంలోని శార్వాణి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ మేడ శ్రావణ్‌రెడ్డి సోమవారం తెలిపారు. కరాటే, యోగ పోటీల్లో జీ నేహ (బంగారు), వై శృతి (వెండి), వై శాన్విత, ఆర్ స్నేహిత్‌కుమార్ (కాంస్య) పతకాలు సాధించారని పేర్కొన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి కరాటే, యోగా నేర్చుకోవాలని సూచించారు. శరీర, ఆరోగ్యం, ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగ పగుతాయని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు, కరాటే మాస్టర్ రామగిరి స్వామి, ఉపాధ్యాయులు, పీఈటీ అభినందించారు.

# సివిల్ రైట్స్ డే

దండేపల్లి, డిసెంబర్ 30 : దండేపల్లి మండలం లక్ష్మీకాంతాపూర్‌లో సోమవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. హక్కులకు బంగం కలిగినా చట్టపరమైన చర్యలు చేపట్టి, హక్కుల సాధనకు కృషి చేయలన్నారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అట్రాసిటీ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చల అంజన్న, ఆర్ఐ భూమన్న, సోషల్ వెల్ఫేర్ అధికారి రాజగోపాల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మందమర్రి రూరల్, డిసెంబర్ 30 : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సతీశ్ కుమార్ సూచించారు. మండలంలోని అందుగుల పేటలో సోమవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ప్రజలకు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. పౌర హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో గిర్దవర్ పద్మజ, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ వెంకటేశ్, ఎన్జీవో దేవరాజ్ పాల్గొన్నారు.

# ఏజెన్సీ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

సిర్పూర్(యూ), డిసెంబర్ 30 : ఏజెన్సీ ఆదివాసీ చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ ఆడ నర్సింగ్‌రావ్ అన్నారు. హనుమకొండలో సోమవారం జరిగిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘాల సమావేశంలో సిర్పూర్(యూ) మండలం నేట్నూర్ గ్రామానికి చెందిన నర్సింగ్‌రావ్‌ను ఏవీఎస్‌పీ రాష్ట్ర కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఆదివాసుల సంక్షేమమే లక్ష్యంగా కొన్నేళ్లుగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జాతియ నాయకులు కేవీ రావు, పూనెం శ్రీనివాస్‌రావ్, దాట్ల నాగేశ్వర్, ఉయకే శంకర్, కల్లూరి జయబాయి, కుసరం నీలకంఠం, సోయం కామరాజు, నైతం బాలు, కల్తీ కుమార్, రాజేశ్వర్, సురేశ్, వేంకటేశ్వర్లు, చంద్రయదొర, సెడ్మకి రామరావు ఉన్నారు.

# యువత చేతుల్లోనే సింగరేణి భవిష్యత్

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 30 : సింగరేణి భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని, ప్రతి కార్మికుడూ సంస్థ అభివృద్ధి కోసం పాటుపడాలని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా సూచించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎంవీటీసీ శిక్షణ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. శిక్షణ పొందుతున్న కారుణ్యా నియామక ఉద్యోగ బదిలీ వర్కర్లు, ఇంటర్నల్ ద్వారా నూతనంగా ఎంపికైన ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ అభ్యర్థులను కలిశారు. యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, శిక్షణ పొందుతున్న యువ కార్మికులు పాల్గొన్నారు.

# సీఏ ఉత్తీర్ణత సాధించిన శివకుమార్‌కు సన్మానం

మందమర్రి, డిసెంబర్ 30 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన బుడిగె శివకుమార్ చార్టెడ్ అకౌంట్స్(సీఏ) విజయవంతంగా పూర్తి చేశారు. గ్రామానికి చెందిన బుడిగె రాజేశ్వరి సమ్మయ్య దంపతుల కుమారుడు శివకుమార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ కళాశాలలో ఏడేళ్ల సీఏ విద్యనభ్యసిసంచాడు. ఇటీవల ఫలితాల్లో ఫైనల్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన శివకుమార్‌ను, ఆయన తల్లిదండ్రులను సోమవారం కురుమ సంఘం సభ్యులు, గ్రామస్తులు సన్మానించారు. సంఘం సభ్యులు, గ్రామస్తులు బండి శంకర్, భీరయ్య, పోశన్న, శంకర్, సుధాకర్, సత్యనారాయణ, మల్లన్న, సాగర్ తదితరులు పాల్గొన్నారు.